

తెల్ల
మేఘం

వంటింట్లోంచి అంట్ల గిన్నెలు పనిమనిషికి వేదామని వాకిట్లోకి తెస్తున్న శారదకు సన్నగా ఏదో ప్రశ్న వినవస్తే వీధి గేటువైపు చూసింది.

"రామ్మూర్తిగారిల్లు ఇదేనాండీ?" ఒక చేత్తో పెట్టె పట్టుకుని అడుగుతోంది ఎవరో ఒకామె. సన్నగా వుంది. వయసు ఇరవై వుండొచ్చు. అప్పుడే ఆమెని తీసుకువచ్చిన రిక్షావాడు వెళ్ళిపోతున్నాడు.

"ఇదే. రండి లోపలికి!" ఆహ్వానం పలికి చేతిలోని గిన్నెలు పనిమనిషికి వేసేందుకు వెళ్ళింది శారద.

ఆమె మెల్లగా లోపలికివచ్చి పెట్టె ఒకవారగా వుంచి కుర్చీలో కూర్చుంది. శారద చేతులు తుడుచుకుంటూ గదిలోకివచ్చి "ఆయన స్నానం చేస్తున్నారు కూచోండి" అని చెప్పి వంటింట్లోకి వెళ్ళి కాఫీ తయారుచేసే పనిలో పడింది. 'ఎవరబ్బా, చుట్టమో స్నేహితురాలో' అనుకుంటూ భర్తవంక చుట్టాల గురించి ఆలోచించడం మొదలెట్టింది. అయినా ఈమె ఆచూకీ ఆమెకేమీ అంతు దొరకలేదు. 'సరే ఆయన స్నానం కానీ' అనుకుంది.

మొలకి తువ్వాలు చుట్టుకుని గదిలోకి విసురుగా రాబోయి ఎవరో 'ఆవరాలు' వుండటం గమనించి వెనక్కితగ్గి అటుంచి అటే వంటింట్లోకి పరిగెత్తినట్టు దూరి "వచ్చింది ఆడవాళ్ళని చెప్పక్కర్లే, వెళ్ళి ఆ పంచ, బనీను ఇలా తీసుకురా!" అని కసురుకున్నాడు రామ్మూర్తి.

ఆ అమ్మాయి నిలబడి గదిలోని ఫోటోలకేసి చూస్తోంది. మూర్తి వచ్చిన సవ్వడికి ఇటు తిరిగి చూసింది.

"నాపేరు కమల-ఖమ్మంనించి వస్తున్నాను. మీ రామారావు బాబాయిగారు మాకు తెలుసు" పరిచయం చేసుకుంటూ నమస్కారం పెట్టింది.

"ఇదేరావడమా-" నమస్కారం అందుకుంటూ అన్నాడు.

"అవునండి-మూడురోజులయింది. ట్రైనింగ్‌కి ఆర్డరువచ్చి-నిన్నా మొన్నా ఆ సర్టిఫికెట్లు అవీ సంపాదించేందుకు అయిపోయింది. పైగా ఈ హైద్రాబాద్‌లో ఎవరూ తెలిసినవాళ్ళు లేరండి. మీ బాబాయిగారు నా అవస్థ చూసి ఈ చీటీ ఇచ్చి పంపారండి!" కొత్త లేకుండా చెప్పుకుపోతోంది.

శారద కాఫీకప్పుతో అలాగే నిలబడివుంది. పులుస్టాపు కామాలు లేకుండా పద్యం అప్పచెప్పినట్టు ఆమె వల్లిస్తూంటే 'గడుసు పిండమే'-అనుకుని కాఫీ అందిచ్చింది.

"థాంక్స్!" అందుకుంటూ శారదకి మంచి నవ్వొకటి బహూకరించింది.

మూర్తి చీటి చూసుకున్నాడు. బాబాయిగారికి బాగా తెలిసున్న స్నేహితుడి కుమార్తె ఈమె. తండ్రిపోయి రెండేళ్ళయిందట-పెద్ద కుటుంబం-అందులో ఈమే పెద్దమ్మాయి. పది, ఏడు క్లాసుల్లో ఇద్దరు చెల్లెళ్ళూ, చిన్న క్లాసుల్లో ముగ్గురు తమ్ముళ్ళూ వున్నారు. బాంక్‌లో సెలక్షన్ వచ్చింది. ముందు ట్రైనింగ్ వుందట.-'ఎవరూ ఈ అమ్మాయికి తెలిసినవాళ్ళు లేరు. నీ యింట్లో వుంచుకొని జాగ్రత్తగా చూడు' అని వ్రాశాడు బాబాయి.

మూర్తి ఆమెవేపు చూశాడు. అప్పటికి ఆమె కాఫీ ముగించి అతనికేసే చూస్తోంది.

"ఎన్నాళ్ళు ట్రైనింగ్?"

"ఆరు నెలలు వుంటుందండి. ఈ సంవత్సరం పిల్లలందరూ సగం సగం చదువుల్లో వున్నారు. పైగా అక్కడ వ్యవహారాలున్నాయండి. ఈ ఏడాది గడిస్తే అమ్మ పిల్లలు ఇక్కడికే వచ్చేస్తారండి."

శారదకి అయోమయంగా తోచి లోపలికి జారుకుంది ఆమె తాగిన కాఫీకప్పు అందుకుంటూ.

లోపలికివచ్చి శారదతో అంతా చెప్పాడు.

ఆమె ఏం మాట్లాడలేదు. ఇబ్బందిగా మొహం పెట్టింది.

వాదోపవాదాలకి తగిన సమయం కాదు. ఎలా అయితే అలా అవుతుందని-"సరే, నాకు ఆఫీసుకి టైమవుతోంది. భోజనం వడ్డించు!" అన్నాడు మూర్తి.

గదిలోకి వచ్చి ఆఫీసుకి పోయేందుకు అన్నీ సర్దుకున్నాడు.

**భమిడిపాటి హైమవతి**

"అయితే మీరెప్పుడు జాయినవ్వాలీ-"

"రేపు జాయినవుతానండి-"

"సరే ఇవాళ రెస్టేకదా-సాయంకాలం మాట్లాడుకుందాం-నాకు ఆఫీసుకి టైమయింది. వస్తాను"

భోజనం ముగించి ఆఫీసుకి వెళ్ళాడు.

సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆడవాళ్ళిద్దరూ ఆప్తమిత్రుల్లాగ కబుర్లలో పడ్డారు. శారద మూర్తిని చూసి లేవబోతే, "మీరుండండి అక్కా, నే తెస్తాను కాఫీ-" అని కమలే లేచి వెళ్ళింది లోపలికి.

శారదకి తనని కమల 'అక్క' అనడం అంత బాగనిపించలేదు - అంత కంటె అతన్ని 'అన్నయ్యా' అంటే బాగుండిపోను - అనుకుంటోంది!

ఇంతలో ఫ్లాస్కు, గ్లాసు పట్టుకుని కమల వచ్చింది.

"ఎలా వుంది మావూరు? బజారికి వెళ్ళారా" పలకరించాడు, కమలను.

"ఎక్కడికి వెళ్ళలేదండీ - రాత్రంతా నిద్దర లేదు - శుభ్రంగా స్నానం చేసి పడకేశాను. పగలంతా-" ఫ్రీగా మాట్లాడేస్తోంది అప్పుడే-అనుకుంది, శారద.

మూర్తి కాఫీ తాగి, "శారదా, అలా వెడదామా-" అన్నాడు.

"ఓ అరగంటాగండి-" అని చెప్పి శారద రాత్రి భోజనాల ఏర్పాటుకి తుది మెరుగులు దిద్దడానికి లేచింది.

రోజూ మూర్తి ఆఫీసునించి రాగానే ఆరున్నరా ఏడు అయ్యాక, ఇంటికి దగ్గర్లోనే వున్న పబ్లిక్ గార్డెన్స్‌లో అలా ఓసారి తిరిగి ఇంటికి చేరుకోడం వాళ్ళకి అలవాటు. శనివారం అయితే సినిమాకి పోతారు. పెళ్ళయిన ఈ ఏణ్నర్ధం నుంచీ ఇలాగే సాగుతోంది; పిల్లలు పుట్టుకొస్తే మనకివన్నీ కుదుర్తాయా ఏమన్నానా - అంటూ హడావుడి చేస్తాడు మూర్తి. తను ఏమీ చదువుకోకపోయినా, పల్లెటూరునించే వచ్చినా ఈ ఏణ్నర్ధంలోనే తనను పూర్తిగా మార్చేశాడు. ఇప్పుడు తనని చూసిన వాళ్ళెవ్వరూ తను చదువుకోలేదంటే నమ్మరు. మూర్తికి జీవితం ప్రసాదించిన మొదటి వరం ఏమిటంటే ప్రతి దాన్ని తేలిగ్గా తీసుకోగలగటం. అతనికి ఈ ముప్పై యేళ్ళ జీవితంలోనూ దేని గురించీ సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం రాలేదు.

కమల కూడా లేచి వచ్చింది. "అంతా అయింది కదమ్మా–మీరు వెళ్ళిరండి – పోపు వేయించి కలిపేస్తే పచ్చడి అయిపోయినట్టే కదా" అంటూ పని కల్పించుకోడం మొదలెట్టింది.

శారదకి ఎలాగో అనిపించినా ఏమనలేక టాయిలెట్ అవడానికి లేచింది.

అంతా అయ్యాక మూర్తి "వొక్కరూ వుంటే ఏం తోస్తుంది? మీరూ రండి–" అన్నాడు.

"ఒక్కతెనే వున్నప్పుడే నాకు బాగా కాలం గడుస్తుందండీ – మీరు వెళ్ళిరండి–!" అంది కమల వీడ్కోలు ఇస్తూ.

*

పచ్చికలో మోచేతుల మీద ఆనుకుని పడుకున్న మూర్తి–అతనికి ఎదురుగా మోకాళ్ళ మీద తల పెట్టి అతని మాటలు వింటున్న శారదా–కూడా అదే ఆలోచిస్తున్నారు.

"బాబాయిగారు పంపినప్పుడు కాదనడం ఎలాగే–అందులోనూ ఈమె శాశ్వతంగా వుండి పోయేదా ఏమన్నా–నీ యిబ్బంది నాకు తెలుసనుకో. కాని మనం ఇంత చిన్న విషయంలో తేలిపోవడం అంత బాగా తోచదు!"

"నేననేది అదికాదు–" అని ఆమె భర్త ముఖంలోకి చూసింది.

దూరం నించి సన్నటి వెన్నెలలాగా కురుస్తోంది నియోన్ లైటు కాంతి. ఆకుల నీడల్తో సహా మూర్తి ముఖం మీద ఆడుతోంది - అంత అమాయకమైన ముఖం, ఆ మనస్సులోని స్వచ్ఛ తను అద్దంలా ఎత్తి చూపుతూంటే–శారద తనలో రగుల్తున్న ఆలోచనలకి సిగ్గుపడుతోంది.

ఎలా చెప్పడం–తమ మధ్య ఓ మూడోమనిషి. అందులోనూ వయస్సులో వున్న అమ్మాయి–జరగరానిది ఏదైనా జరిగితే?–ఏదెలా వున్నా చుట్టూవున్న వాళ్ళేమనుకుంటారు? ఈ ఆఖరు పాయింటే బయటికి అంది.

మనసుకీ మనసుకీ ఎంత దూరం!

మూర్తి హాయిగా నవ్వేడు, తేలిగ్గా తీసి పారేస్తూన్నట్టు.

"చుట్టూవున్న వాళ్ళు ఎవరు శారదా. నువ్వే-నువ్వే, వేరు వేరు రూపాలు ధరించి నీమనస్సుని ప్రశ్నించుకుంటావు తప్ప–ఈ వూళ్ళో నిన్నూ నన్నూ అంత పట్టింపుగా చూస్తూ టైం వేస్టు చేసుకోడానికిది ఆరుమూరుకాదు. అయిద్రాబాదు. అలాంటి పిచ్చి పిచ్చి వూహలు మానేసి – నీకు ప్రత్యేకంగా ఇదీ అనిపించేంతటి అభ్యంతరం వుంటే చెప్పు – ఆలోచిద్దాం. ఆమెకేం, ఇవాళ వుంటుంది. రేపు పోతుంది" అన్నాడు.

అతను నేర్పిన సంస్కారం ఆమెచేత "నాకు అభ్యంతరమే–!" అనబోతున్న మనస్సుని నొక్కివేసింది.

*

"అక్కా, ఈ చీరె ఎలా వుంది చెప్పండి!" కమల ఓ రోజు సాయంకాలం ఆఫీసునించి వస్తూ అంది పేకెట్టు అందిస్తూ.

"చాలా బావుంది–" అంది చూస్తూ. లైట్ బ్లూలో ప్లేన్ జార్జెట్.

"అయితే ఇది ఈ చెల్లెలి కానుక, మీకు–" సరదాగా తేలిగ్గా అనేసింది, కమల.

"నాకా!" నిర్ఘాంత పోయినట్టు, తుళ్ళిపడింది శారద ఏమిటిది–అన్నట్టు చూస్తూ.

"అవునక్కా–మీకే–మీ మంచితనం వల్లే నేనీ వూళ్ళో నిలబడగలిగాను. మీ ఆదరణ వల్లే ట్రయినింగులో అప్పుడే ఓ నెల హాయిగా గడిచి పోయింది. నా మొదటినెల జీతం లోంచి మీకు నచ్చిన చీర తీసి యివ్వాలనుకున్నాను. కాదన కండి అక్కా–"

శారద కమలవేపు చూసింది. ఎంత దీనంగా అర్థిస్తోంది, తనను! అనునయంగా అంది: "అదికాదమ్మా, అక్కడ మీ అమ్మ వాళ్ళు అంత బాధల్లో వుండగా నూరూ, నూటపాతికా పెట్టి వొక్కసారిగా ఇప్పుడు నాకు ఈ చీర తియ్యకపోతే ఏమొచ్చింది–నువ్వూ నేనూ ఎక్కడికిపోతాము? జీతం అంతా అమ్మగారికి పంపితే ఎంత సంతోషిస్తుంది చెప్పు – మొదటి నెలే తీసెయ్యాల్నా. నాకు చీర?" అంది కొంచెం మందలింపు కలిపి.

"కాని, నాకు ఇప్పుడు లభించే ఆనందం ఇంకోసారి తీస్తే రాదక్కా – దేవుడికి అనుకున్న రోజు తప్పించి వేరే రోజు కొబ్బరికాయ కొడితే ఎలా వుంటుంది చెప్పండి—"

"ఛ, దేవుళ్ళతో ఎందుకు పోలుస్తావు కమలా, మనం మనుషులం!"

"దేవుళ్ళంటే గుళ్ళల్లో వుండేవాళ్ళే కాదక్కా! ఇళ్ళలో, వూళ్ళల్లో వుండేవాళ్ళు కూడానూ–పైగా మీలాంటి వాళ్ళ రూపాల్లోనే వుంటారు."

శారద నిజంగానే సిగ్గుపడింది. ఈ అమ్మాయితో ఇంకేం వాదించగలదు, తను!

ఆమె చేతిలో చీర వుంచి గబుక్కున ఆమె కాళ్ళపై పడింది, కమల.

"ఛఛ–ఏమిటమ్మా యిది–" అని కమలని లేపి, తల మీద చెయ్యేసి నిమిరింది, లాలనగా. ఆమెకీ మాటలు రావడం లేదు. తనకి మాత్రం ఏమంత అనుభవం వుందని, దండాలు పెట్టించు కోడంలోనూ, పొగడ్తలు స్వీకరించడంలోనూ!

కమల లేచి నిలబడి చెమ్మగిల్లిన కళ్ళని వొత్తుకుంటోంది. శారద కాఫీ తేవడానికన్నట్టు వెళ్ళింది.

కమల ఆమె కూడా వెళ్ళి "అక్కా!" అంది ఏదో అభ్యర్థిస్తున్నట్టు.

శారద చూసింది ఏమిటన్నట్టు.

"రేపట్నుంచీ పొద్దున్న వంట నే చేస్తానక్కా!"

"అదేమలాగ?"

"రాత్రి వంటయితే నాకు కుదరదు!"

"అసలు ఏపూట వంటయినా నువ్వు చెయ్యడం ఎందుకూ? నాకేమీ కష్టం లేదు. ఇద్దరికి వొండ గలిగినదాన్ని మూడోదానివి నీకు వేరే వార్చాలా ఏమన్నానా-అయినా ఇప్పుడెందుకు, ఆ సమస్య?"

"అది కాదక్కా–నాకు వూరికే కూచో బుద్ధి వెయ్యడం లేదు. పైగా నాకు చాతవును కూడా–" అంతకంటే చెప్పలేకపోతోంది, కమల.

"నీకు చాతకాదనికాదు–అయినా పై పనులన్నీ రోజూ నువ్వే చేస్తున్నావుగా—"

కమల మరేమీ మాట్లాడలేదు. ఏదో గొంతు లోకి దిగని మందుని నోట్లో వుంచుకున్నట్టుగా బాధపడింది.

ఆ రాత్రి కమల అన్న మాటలు తెలుసుకుని మూర్తి అన్నాడు – "తనకి తాను కల్పించుకుని ఏదన్నా చేస్తే ఆమెకి తృప్తేమో—"

శారద చీకట్లోకి చూస్తూ వూరుకుంది.

*

మరోనెల గడిచింది.

ఈసారి జీతంలోంచి కమల కొంత డబ్బు తీసి శారదకు ఇవ్వబోయింది.

"ఈసారి ఏమయింది నీకు?" అన్నది శారద, తీసుకోకుండా.

"వూరికే—ఇంట్లో ఖర్చులు వుంటాయికదా అని!" నసుగుతూ అన్నది, కమల.

" నీకేమన్నా పిచ్చా ఏమిటి కమలా—నీవల్ల మాకు అదనంగా ఖర్చయితే అది నువ్విచ్చినా మేం తీసుకున్నా అర్థం వుంది. మాకేమీ అటు వంటిది లేదు. ఇదిగో, నువ్విలా మాటిమాటికి మొహమాటపడితే ఏం బాగుండదమ్మాయ్—" ఖండితంగా అన్నట్టున్న ఆమె స్వరాన్ని కొత్తగా వింటున్నట్టు ఫీలయి బేలగా చూసింది, కమల.



గంటి పద్మశ్యామల

పదవ తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయిన గంటి పద్మ శ్యామల (విజయవాడ) కూచిపూడి, భరత నాట్యాలను జోస్యుల సీతారామశాస్త్రిగారి దగ్గర అభ్యసిస్తూ—చాలాచోట్ల చాలా ప్రదర్శనలు కూడా ఇచ్చింది. గుంటూర్లో 'ప్రథమ బహుమతి' కూడా పొందింది. వీణ కూడా నేర్చుకుంటున్న పద్మ శ్యామలకు, కేంద్ర ప్రభుత్వపు స్కాలర్‌షిప్–వున్నది.

ఇది చాలా సున్నితమైన విషయం. ఏమన డానికీ తోచడంలేదు, కమలకి.

" అదేదో ఆయన్తోనే చెప్పు!" అంది శారద, కమలనించి జవాబు రాకపోడం చూసి.

" ఆయన్తో నేనెలా చెప్పేదక్కయ్యా! – అయినా ఖర్చు కాకపోవటం ఏమిటి? ఇదివరకు ముప్పైకిలోలు తెచ్చేవారు, బియ్యం. ఇప్పుడెన్ని తెస్తున్నారు? ఇదివరకు పాలు ఎన్ని తీసుకునే వారు? ఇంకా ఇతర వెచ్చాలమాటేమిటి? ఎలా చూసినా నా గురించి ఖర్చు కొంచెమైనా ఎక్కువ అయివుంటుందే – ఇన్నెందుకక్కయ్యా, నన్ను మీ స్వంత కుటుంబంలో చేర్చుకొని ఆదరిస్తున్నది చాలక..." మూర్తి రాకతో చటుక్కున ఆగి పోయాయి, కమల నోట్లోంచి వస్తున్న మాటలు.

" ఏమండోయ్, మాట!" శారద గట్టిగా పిలిచింది, భర్తని.

"వొద్దక్కా. పుచ్చుకోపోతే మానెయ్యండిగానీ ఆయనతో అనకండి, మీకు పుణ్యం వుంటుంది" అని గొణిగింది కమల, అప్పటికే వొళ్ళంతా చెమటలు కారిపోతూండగా.

మూర్తి బట్టలు మార్చుకొని వచ్చాడు.

" కమల మనల్ని సినిమాకి తీసికెడతానంటోం దండీ!" అన్నది శారద ప్లేటు మార్చి. నిజానికి ఆమెకీ అదోలానే వుంది-అయినా శాపీగా అతనితో కదపవచ్చులే అనుకొంది.

" వెరీగుడ్–నేను రడీయే–"

ముగ్గురూ టాయిలెట్ అయి బయల్దేరారు.

దారిలో అన్నాడు మూర్తి–" కమలా మీ అక్కకయితే అంత మంచి చీర తీశావుకదా, మరి నాకేదీ, బహుమతీ?"

" చాల్చాలు వూరుకోండి ఆ అమ్మాయి నిజమనుకోగలదు!" అంది శారద సీరియస్‌గానే.

" బాగుంది, నువ్వు చెప్పేది. ఆవిడ నిజం అనుకోవాలనేగదా, నేనూ చెపుత? – అయినా నువ్వు చెప్పు – ఇంటి పెద్దను నేనై వుండగా ముందు నీకు బహుమతి ఇవ్వడం ఏమిటీ?"

కమలకోపక్క సిగ్గూ ఇంకోపక్క ఆనందమూ కలుగుతున్నాయి. ఏమీ అనలేకపోతున్నది.

" ఏం కమలా, ఏ పాట అయినా విన్నాక వెంటనే రెండోసారి అదే వినడం అలవాటా, నీకు?" తెచ్చిపెట్టుకున్న చొరవతో అన్నాడు.

" ఆఁ! మీరు ఇలాంటి పాటలు పాడితే ఎన్నిసార్లన్నా వింటారు!" శారద గదమాయిస్తూ అన్నది.

" ఏం, ఎందుకు వూరుకోవాలంట – ఇంతకీ నా మాట ఏమంటుందిటా, మీ కమల?" కొంచెం ఎబ్బెట్టుగా వున్నా, ఆదేదో తెచ్చిపెట్టుకొని అంటున్నట్లు అంటున్న అతన్ని చూసి కమలకి నవ్వాగింది కాదు.

" చెప్పండీ, మీకేం కావాలో?" అంది, మెల్లగానే.

" వోహో, అక్కడికి మీ అక్కయ్యని అడిగే ఇచ్చినట్టు!"

" అక్కయ్యకి అంటే నాకు తెలుసు, ఏమి వ్వాలో – మీరు....మీకు ఏదిష్టమో నాకెలా తెలుస్తుంది?" అంది కొంచెం కొంచెంగా మాటల్ని ఏరుకుంటూ, ధైర్యాన్ని కూడా దీసుకుంటూ.

" చూశావా, శారదా, కమలంటే ఏమను కున్నావ్, వెనక్కి తగ్గిపోతుందనుకున్నావుకదూ?" అన్నాడు, 'ఎంత నాటకం ఆడేనో చూడు!' అన్నట్టుగా.

శారదకి ఏమిటో ఎబ్బెట్టుగా తోచినా " నేనేం అనుకోలేదలాగ!" అని మాత్రం అంది. రుచించని పదార్థం ఏదో గొంతులోంచి దిగు తున్నట్టుగా అనిపించింది ఆమెకి.

దగ్గర్లోనే వున్న సినిమా చూసి ఇంటికొచ్చారు.

భోజనాలయి, పడుక్కోబోయే ముందు శారద అన్నది: " కమల నూటయాభై రూపాయలివ్వ బోయిందండీ, సాయంత్రం – నాకేమిటో పుచ్చు కోవాలనిపించలేదు. ఏదేదో చెప్పింది తను – 'దానికవడం లేదా, దీనికవడం లేదా, నా వల్ల మీ ఖర్చులు అంతో యింతో పెరుగుతున్నాయి కదా' అంటూ – నాకేమిటో ఎబ్బెట్టుగా తోచి వద్దనేశాను."

" అలా వద్దనకూడదు. వ్యవహారం వ్యవ హారమే. తను వూరికే కూచుని తింటున్నట్టు ఫీలయితే ఆమెకు మాత్రం ఏం సుఖం? పైగా మనకీ తనకీ ఏం సంబంధం వుందని మనింట్లో వూరికే తినడానికి? అంచేత ఆ విషయంలో నిరుత్సాహపరచకు. ఆమెకి వేరే పోవాలన్నా ఎవరున్నారు చెప్పు. వొంటరిగా ఎక్కడ వుంటుంది? అందులోనూ వాళ్ళ కుటుంబాన్ని ఇక్కడికి తరలించడానికి ఎలా లేదన్నా ఇంకో ఆర్నెల్లయినా పడుతుంది." అన్నాడు.

భర్త వాదంలో నిజం వున్నా శారద వుద్దేశం వేరు—ఇలా రెండు మూడుసార్లు నిష్కర్షగా పుచ్చుకోకుండా వుంటే ఆమె గత్యంతరం లేక వేరే వెళ్ళిపోతుందని. కాని మూర్తి 'ఆమెకి మాత్రం ఎవరున్నారు, ఎక్కడికి పోతుంది,' అంటున్నాడు–అంటే ఈ సాహచర్యం ఇలా కొనసాగాల్సిందేనా–అందులోనూ ఆరేడు నెలలట.

ఇప్పటివరకూ ఏమీ జరగలేదుగాని, రాబోయే సుదీర్ఘమైన ఆరు నెలల కాలం తను లోలోపలి సంఘర్షణతో ఎలా నెట్టుకు రావడం? తన ఆలోచనలు సంకుచితంగా వుండవచ్చును. కాని నిజంగా వాళ్ళలాగే వుంటాయా రోజులు — భర్త మీద తనకి నమ్మకమే — ఆ అమ్మాయి కూడా వెకిలి మనిషి కాదు. అయినా.... శారద మథన పడిపోతోంది.

భర్త ముఖంలోకి చూసింది.

అమాయకంగా తృప్తిగా నిద్రపోతున్నాడు.

*

కమల ఆ మర్నాడు వూరుకోలేదు. పాలవాడు వస్తే డబ్బు లెక్క చూసి తనే ఇచ్చింది. ఆ రోజు ఇంట్లోనే వుండి మధ్యాహ్నం గేస్‌సిలిండరు వస్తే తనే బిల్లు చెల్లించింది. నేతివాడు, చాకలి, వాళ్ళ లెక్కల్ని కూడా సెటిల్ చేసింది. ఇలా మొత్తానికి తను ఇవ్వదల్చుకున్న మొత్తానికి కాస్త యిటూ అటూగా ఇచ్చేసింది. శారద చూసీ చూడనట్టు వూరుకుంది.

ఇప్పటికిప్పుడే మూడు నెలలు గడిచాయా— వ్యక్తుల్లో కనిపించని మార్పులు వ్యక్తిత్వాల్లో స్పష్టంగా గోచరిస్తున్నాయి తనకి — శారద స్వతహాగా మందంగా వుండే మనిషి. వందమందిలో వున్నా వొంటరిగా వున్నట్టు కనిపిస్తుంది. తనెంత స్నేహంగా, స్వచ్ఛంగా వున్నా ఆమె కొన్ని గీతల్ని గీసుకుని కూర్చుంటోంది. ఆ గీతలు తను చూడగలగడం ప్రారంభించినప్పటినుంచీ కమలకి దిగులు పట్టుకుంది. పోనీ చెల్లెళ్ళ తమ్ముళ్ళ చదువులు పాడైపోతే పోనీ, మరో యేడాది ఎక్కువైతే అవనీ తేల్చేసుకుని వేరే పోదామా అనిపిస్తుంది. ఇంతలోకే ఏం జరిగిందనీ అంత అర్థాంతరంగా వాళ్ళని కదపడానికి అనీ అనిపిస్తుంది.

మూర్తి నిజంగా రామచంద్రమూర్తే! కమల మనస్సు అతన్ని తల్చుకుంటే ఎంతో తృప్తిగా నిట్టూర్పు కలుగుతుంది. భార్య ఎంత సాధారణ మనస్తత్వం కలదైనా వో దేవతలా పూజిస్తాడు. మగాళ్ళలో యింత దైవత్వం కలిగిన వాళ్ళుంటారని తనెప్పుడూ వూహించలేదు. వొక్కసారి కూడా తనకేసి వికారమైన దృష్టితో చూసి ఎరగడు. మళ్ళీ మనిషి ఎంత సరదాగా, స్నేహంగా, ఆప్యాయంగా వుంటాడో — ప్రతీ చిన్న విషయానికీ ప్రాధాన్యతనిచ్చి తన క్షేమం కనుక్కుంటాడు. తన తల్లి, తోబుట్టువుల గురించి గంటల తరబడి జ్ఞాపకం చేస్తూ మాట్లాడతాడు. నిజానికి ఆయన చూపే ఆ వాత్సల్యం వల్లనే తల్లినీ, తోబుట్టువుల్నీ వొదిలి ఇంత దూరంలో వున్న వారందరికీ ఎంతో దగ్గరగా వున్నట్టే తను భావించగలుగుతోంది!

ఇంత మానసిక క్షోభలోనూ, కమల భగవంతుడు సృష్టించిన ఈ సృష్టిలో అతి ఉన్నతమైన మానవ జన్మలోగల స్వచ్ఛతనూ కాలుష్యాన్నీ బేరీజు వేసుకొంటూ నవ్వుకుంటుంది.

ఆ నెల అలాగే గడిచింది, మూర్తికి చాలా సహజంగా, శారదకి భయంగా, కమలకి భారంగా.

ఏదేనా సంఘటనలాంటిది — తనకి అనుకూలమైన సంఘటన జరిగితే బాగుండునని శారద తహతహలాడ్డం మొదలెట్టింది. తనలో మొలకెత్తిన భయం — కమల మీద భయం — తను ఎంత సమాధానపడ్డున్నా పెరుగుతోంది తప్ప మాయం కావటంలేదు. తను బయట పడిపోకుండా కమలని బయటికి పంపేందుకు వీలుగా - చిన్న సంఘటన జరిగితే బాగుండును అనిపించసాగింది.

ఆలోచించడం చాతకాని శారద ఆలోచిస్తోంది.

తను పుట్టింటికి కొన్నాళ్ళు వెడితే? కొన్నాళ్ల భర్తని వొంటరిగా వొదిలి వెడితే? అన్నీ అసంపూర్ణంగానే తెగిపోతున్నాయి ఆమె ఆలోచనలు. అవును! అప్పుడు కమల గత్యంతరంలేక బయటికి పోతుంది. కాని—ఆ కారణంగా ఎలా వెడుతుంది? తను బయటపడిపోయినట్టు అవదూ?

శారద అలసటగా చీకట్లోకి చూస్తోంది.

*

ఓరోజు ఉదయానే కమల పెట్టె సర్దుకుంటోంది. తన వస్తువులూ, బట్టలూ అన్నీ ఏరి పెట్టెలోనూ సంచీలోనూ సర్దుతోంది. శారద గమనిస్తూనే వుంది; గమనించనట్టుగానూ వుంది.

"అక్కా! ఇవాళ అమ్మావాళ్ళ దగ్గరకు వెడుతున్నానమ్మా!" అన్నది కమల చాలా సహజంగా.

"అహా! అలాగా. ఏమిటా పెట్టె సర్దుతున్నావని చూస్తున్నాను!"

కమల నవ్వింది.

"అమ్మనీ వాళ్ళనీ ఓసారి చూదామని" కమలే అన్నది.

"అవును మరి చాలా రోజులయింది కదూ!"

"మూర్తిగారు రాత్రి రానట్టుంది. వూరికి వెళ్ళారా?"

"ఆఁ. క్యాంపు వెళ్ళారు నిన్ననే. రేపో ఎల్లుండో వస్తారు!"

"మళ్ళీవచ్చి ఆయనతో చెబుతానక్కా. నేను ఇవాళే వెళ్ళాలి!"

"సరేలే దాందేముంది? ఫోంచేసి వెళ్ళు!"

"అలాగే అక్కా."

మర్నాడు మూర్తి వచ్చాడు.

మరో రెండు రోజులకి కమల వచ్చింది సాయంకాలం పూట.

"ఎప్పుడు రావడం, కమలా!" మూర్తి ఆప్యాయంగా పలకరించాడు. శారద వంటింట్లోంచి వచ్చింది.

"ఉదయాన్నే వచ్చాను."

"మరి సామానేదీ?"

"కేరాఫ్ వర్కింగ్ వుమన్స్ హాస్టల్!" తేలిగ్గా అనేసి నవ్వేసింది.

"ఏమంటుందీ?" అంది శారద.

"ఆఁ ఏం లేదూ, ఆఫీసుల్లో పన్చేసే అమ్మాయిలకి ఇక్కడ ఓ హాస్టలుందిలే. అందులో చేరానూ అని చెబుతోంది!" అని మూర్తి వివరించాడు.

"ఆఁ హాఁ!" అని వంటింట్లోకి వెళ్ళింది శారద, కమలకి కాఫీ తేవడానికి. తన శరీరం తలంటి పోసుకున్నట్టు ఎంతో తేలికయినట్టు— తోచిందామెకి.

కాఫీ తాగి వెళ్ళింది కమల.

శారద మెరిసే కళ్ళని చూశాడు మూర్తి. ఆ కళ్ళల్లోంచి కనబడని తెల్లని మేఘం ఒకటి మాయమైంది. □

ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం వారి విద్య, సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ హిందీ డైరెక్టరేట్ హిందీ పరిచయ పరీక్ష జరిపింది. అందులో ఉత్తీర్ణులైన 187 మందిలో మొదటి స్థానం ఒక విదేశ యువతికి లభించింది! నార్వే దేశానికి చెందిన ఆమె పేరు కుమారి ఎని షీల్.